

## చీరలే శ్రీరామరక్ష

రైతులు చీరలను పలు రకాలుగా వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో బాతుల రక్షణ కోసం చీరలను ఏర్పాటు చేశారు. చలికాలం కావడంతోపాటు వన్యప్రాణుల నుంచి కాపాడేందుకుగానూ చీరలను చుట్టూ వలలాగా కట్టారు. బాతుల వద్దే రైతులు గుడారాలను ఏర్పాటు చేసుకొని అక్కడే జీవనం కొనసాగిస్తున్నారు. ఈ దృశ్యాలను జోగుళాంబ గద్వాల జిల్లా కొత్తపల్లి గ్రామ సమీపంలో 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది.

**-జోగుళాంబ గద్వాల ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 17**

# ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం

- **జలాల హక్కులపై సీఎం దృష్టి సారించాలి**
- **కాంట్రాక్ట్ శక్తుల వల్లే అన్యాయం**
- **అన్ని గ్రామాలకూ బస్సులను పునరుద్ధరించాలి**
- **పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారని, వంద రోజుల వరకు వేచి చూస్తామని ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల సమస్యలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజా తీర్పును శిరసావహిస్తామని కొంతమంది కార్యకర్తలు, నాయకులు కొంత మెరుగ్గా పని చేసి ఉంటే నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజయం సాధించి ఉండేదని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని, ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు హామీలను మాత్రమే అమలు చేస్తున్నట్లు ప్రకటించారు తప్పా రెండు గ్యారెంటీలు పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఆరోగ్య శ్రీ పెంపు పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎంత మందికి చెల్లించారని ప్రశ్నించారు. సీఎం జిల్లాకు సంబంధించిన నాయకుడని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కృష్ణా గోదావరి జలాల హక్కులపై ప్రత్యేక దృష్టి సారించి వాటాను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, అందుకుగానూ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టలను పూర్తి చేయాలని కోరారు. తొలి మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించామని, 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీకి లేని శక్తిని కూడగట్టి నియోజకవర్గంలో బలోపేతం చేస్తే కాంట్రాక్ట్ శక్తులు తనకు టికెట్ కేటాయించకుండా ఆ పార్టీ నేతలు అన్యాయం చేయడం వల్లే తాను బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు వివరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ హామీలను అమలు చేస్తేనే ప్రభుత్వ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు చేస్తున్న ప్రకటనలను ప్రజలు నమ్మరని, అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొంతకాలం ప్రభుత్వానికి సమయం ఇచ్చిన తర్వాత కూడా హామీలను అమలు చేయకపోతే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు అర్థం రవి, లక్ష్మయ్య, బాలగౌడ్, కుర్మయ్య, కృష్ణారెడ్డి, సంతోష్‌రావు, భీముడు, ఆహ్మద్‌పాషా, సత్యం, వెంకటస్వామి, రాజులతోపాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# జూరాలకు స్వల్ప వరద



ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటినిల్వ

ధరూర్, డిసెంబర్ 17 : జూరాల ప్రాజెక్ట్‌కు స్వల్ప వరద కొనసాగుతున్నది. 231 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 439 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. కుడి కాల్వకు 351క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 88 క్యూసెక్కుల నీరు అవిరి అవుతున్నది. ప్రాజెక్ట్ నీటిమట్టం 7.609టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.902 టీఎంసీల నీటిమట్టం ఉన్నది. ప్రాజెక్ట్ నీటిసామర్థ్యం , 1045 అడుగులకు గానూ ప్రస్తుతం 1,041.601 అడుగుల నీటిమట్టం నిల్వ ఉన్నది.

### ఆర్డీఎస్‌లో 6.2అడుగుల నీటి నిల్వ

అయిజ, డిసెంబర్ 17 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ 6.2 అడుగులకు చేరుకున్నది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం తగ్గుతోంది. ఆదివారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 313 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 6.2 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

### టీబీ డ్యాంలో..

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 1,916 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 11.431 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1,590.47 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అలంపూర్, డిసెంబర్ 17 : అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొన్నారు. తుంగభద్రా నదిలో భక్తులు స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మ వారి ఆలయంలో అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అన్నదాన సత్రంలో భక్తులు ఉచిత భోజనాలు చేశారు. ఆలయ ఈవో పురేందర్‌కుమార్, పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు





కొత్తకోటలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

కొత్తకోట, డిసెంబర్ 17 : ఉన్నత చదువుల కోసం 16ఏండ్ల వయస్సులో విడిపోయిన వారంతా 48ఏండ్ల తర్వాత కలుసుకొని అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పట్టణంలోని ఆనంద్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. నాటి పదో తరగతిలో 90మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 50మంది ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 20 మంది గైర్హాజరు కాగా మరో 20మంది మృతిచెందారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అందరినీ ఒకే వేదిక వద్దకు తీసుకొచ్చేందుకు కృషి చేసిన చిన్న నాటి స్నేహితులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాది మోహన్‌కుమార్, నారాయణరెడ్డి, రవికుమార్, దామోదర్‌రెడ్డి, లక్ష్మయ్య, సత్యం, సరళ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీ శ్రీనివాసులు

## పీయూలో ఆర్చరీ, బ్యాడ్మింటన్ క్రీడా ఎంపికలు

పాలమూరు,డిసెంబర్ 17 : పాలమూరు విశ్వవిద్యాలయంలో ఆదివారం ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ, బ్యాడ్మింటన్ క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించినట్లు పీయూ పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు గురుకాశీ యూనివర్సిటీ పంజాబ్‌లో నిర్వహించే షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, వేబర్ ఇన్‌సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తమిళనాడులో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీలో పాల్గొనున్నట్లు తెలిపారు.

## 22న జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 17 : జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన స్థానిక స్టేడియం మైదానంలో జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యాలు(10), జానపదగీతాలు బృందం, (10, సోలో(5)) వ్యక్తృత్వ పోటీలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో గెలుపొందిన వారే రాష్ట్రస్థాయి అర్హులన్నారు. 15 నుంచి 29 ఏండ్ల వయసు వారు మాత్రమే అర్హులని, ఈ నెల 21వ తేదీ వరకు జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కోసం 94415658995 నెంబర్‌ను సంప్రందించాలని సూచించారు.

## ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యానికి రికార్డు ధర

- **నవాబ్‌పేట మార్కెట్‌లో రూ.3,556 పలికిన ధర**

నవాబ్‌పేట, డిసెంబర్ 17 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యానికి క్వింటాకు రూ.3,556 రికార్డు ధర పలికింది. గతంతో పోలిస్తే ఈ వారం ఆర్‌ఎన్‌ఆర్‌కు మరింత ధర పెరగడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యానికి మంచి ధర లభిస్తుండటంతో రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. నవాబ్‌పేట యార్డుకు 13,753 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. అలాగే హంస రకం ధాన్యం 3,299 క్వింటాళ్ల ధాన్యం వచ్చినట్లు ఆయన తెలిపారు. హంస రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,139 అధిక ధర లభించినట్లు వివరించారు. మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.